## కళింగ కల్చరల్ సెంటర్‌లో సిల్క్ ఆఫ్ ఇండియా ఎక్స్‌పో ప్రారంభం



సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూం ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా

**బంజారాహిల్స్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):** బంజారాహిల్స్ రోడ్ నం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో బెంగాల్ హ్యాండ్లూం ఆర్ట్ ఆధ్వర్యంలో సిల్క్ ఆఫ్ ఇండియా ఎక్స్‌పో ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమైంది. క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహరా, టాలివుడ్ అప్ కమింగ్ నటి సహృదా ప్రూటీ, నిర్వాహకులు సోమ్‌నాథ్ బౌమిక్, అభిజిత్ షా కలిసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం రత్న మెహరా మాట్లాడుతూ చేనేత వస్త్రాలు మన సంస్కృతి, చరిత్రతో పాటు గుర్తింపును చాటుతాయని, మగ్గం మీద నేసే ప్రతి దారం గత వారసత్వాన్ని, వర్తమానం సృజనాత్మకతను, భవిష్యత్ ఆశలను కలిగి ఉంటాయని తెలిపారు. నిర్వాహకులు సోమ్‌నాథ్ బౌమిక్, అభిజిత్ షా మాట్లాడుతూ ఈనెల 26 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిర్వహించే ఈ ప్రదర్శనలో 50కి పైగా మాస్టర్ వీవర్‌లు చేతితో నేసిన వస్త్రాలు, సంప్రదాయ చేతిపనుల అసాధారణ ప్రదర్శనతో సందర్శకులను అబ్బురపరిచేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నైపుణ్యం కలిగిన నేత కార్మికులు రూపొందించిన చీరలు, స్కార్ఫ్‌లు, గృహవస్త్రాలు, అనేక రకాల చేతి వృత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బనారసీ చీర, బగల్‌పురి సిల్క్, బెంగళూరు సిల్క్, చైన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జమ్దాని, లెనిన్ కాటన్, టాస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి మొదలైన అన్ని రకాల ఉత్పత్తులు ఇక్కడ ప్రదర్శనలో ఉన్నాయని వారు తెలిపారు.



కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

## కృష్ణస్వామి ముదిరాజ్‌కు ఘన నివాళి

**ఖైరతాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్ తొలి బీసీ మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతిని ఖైరతాబాద్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ఖైరతాబాద్ గణపతి చౌరస్తాలో కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం యువజన అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సందీప్ ముదిరాజ్, రాకేష్‌ముదిరాజ్, రాజశేఖర్ మాట్లాడారు. హైదరాబాద్ నగర మాస్టర్‌ప్లాన్ రూపొందించిన ఘనత కృష్ణస్వామి ముదిరాజ్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు సింగరి రాజ్‌కుమార్, సందీప్‌రాజ్, టీనర్సింగ్‌రావు, భిక్షపతి, ఉదయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో యువతకు తగిన గుర్తింపు



సమావేశంలో మాట్లాతున్న కార్పొరేటర్ బాబా

**బోరబండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** యువ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీలో యువతకు తగిన గుర్తింపు ఉంటుందని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. డివిజన్ పరిధిలోని భారత్‌నగర్‌లో యూత్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. సమాజ సేవ చేయాడానికి రాజకీయాల్లోకి వస్తున్న యువతను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బి.అశోక్, నాయకులు సయ్యద్ ఖయ్యూమ్, దేవేందర్‌రెడ్డి, ఇమ్రాన్‌తో పాటు యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దేవతా చిత్రాల యాగసమర్పణ




దేవతామూర్తుల పాత చిత్రాలను యాగ సమర్పణ చేస్తున్న శ్రీమాతాసేవా సమితి సభ్యులు

**సనత్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** చెత్తలో పారేసిన వేల్పుల పాత చిత్రపటాలను, పాత క్యాలెండర్‌లలో ఉన్న దేవతా చిత్రపటాలను సేకరించిన శ్రీమాతా సేవా సమితి సభ్యులు వాటిని శాస్త్రోక్తంగ అగ్నికి ఆహుతి చేశారు. సనత్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్తలో పడేసిన దేవతా చిత్రపటాలు, క్యాలెండర్లు, విగ్రహాలు, పూజా సామగ్రిని సేకరించిన మాతాసేవా సమితి సభ్యులు సోమవారం హనుమాన్ దేవస్థానంలోని రామ్‌లీలా మైదానంలో యాగసమర్పణ చేశారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు అనుమతితో అర్చకులు కృష్ణశాస్త్రి దేవతా చిత్రాల ఉద్వాసన, విసర్జన కోసం శాస్త్రోక్తంగా పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. ప్రతి ఆలయం వద్ద ఇదే తరహాలో కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఎవరి వద్దనైనా పాత చిత్రపటాలు, విగ్రహాలు ఉంటే తమకు అప్పగించాలని మాతాసేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు కుసుమ విజయ కోరారు.

## ఉప కులాలకు అన్యాయం చేస్తే .. మరో పోరాటానికి సిద్ధం : సనాదన్

**అడ్డగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** కులగణన చేసిన తరువాతనే శాస్త్రియంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఉప కులాలకు అన్యాయం చేయాలని చూస్తే పోరాటానికి సిద్ధమని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపదే సనాదన్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లోని మరాఠబస్తీలో ఉప కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాల సుదీర్ఘ పోరాటం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తాని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి తరుపున అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు తదితరులు

## చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

**రాంనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు పూర్తవుతున్న చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఎందుకు అమలుకు నోచుకోవడం లేదని, అంబేడ్కర్ అభయ హస్తం కోసం విధి విధానాలు రూపొందించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దళితుల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల మెస్ చార్జీలు పెరిగిన ధరలకు సరిపోక హాస్టల్స్‌లో నాసిరకం భోజనం పెడుతున్నారని అన్నారు. సమావేశంలో కేవీపీఎస్ నేతలు కురుమయ్య, పాలడుగు నాగార్జున, మాణిక్యం, మనోహర్, లలిత, రామ్మూర్తి, శేఖర్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానగర్ సాయి సరస్వతి విద్యానికేతన్‌లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్లో చిన్ని కృష్ణుడు, రాధ, గోపిక వేషధారణలో చిన్నారులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున దేవాలయాలకు వచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు.

- ఖైరతాబాద్/సనత్‌నగర్/ఎర్రగడ్డ/యూసుఫ్‌గూడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి)

## శిల్పారామంలో చిన్నారుల సందడి

కళాకారుల నృత్యప్రదర్శన



**మాదాపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ముకుందా.. ముకుందా.. అంటూ శిల్పారామంలో చిన్నారులు సందడి చేశారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకుల మదిని దోచుకున్నాయి. ఈజిప్ట్ నుంచి 14మంది విదేశీ అతిథులు శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు వచ్చారు. సంధ్యకార్తీక్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆద్యంతం అలరించింది. డైరెక్టర్ జనరల్ ఎంసీహెచ్‌ఆర్డీ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ డాక్టర్ శశాంక్ గోయాల్ హాజరై కళాకారులను అభినందించారు.



ఇందిరానగర్ కాలనీలో ఉట్టి కొడుతున్న చిన్నారులు











శ్రీ కృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు



ఖైరతాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి పూజలో పాల్గొన్న సంఘం నాయకులు



కృష్ణాష్టమి సందర్భంగా గోపూజ చేస్తున్న యాదవులు

# బస్తీల్లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

వీఐపీ ప్రాంతాల్లో మాత్రమే రక్షణ చర్యలు ● భయాందోళనలో బస్తీల వాసులు



ఖైరతాబాద్ ఎంఎస్ మక్తాలో కంచెలేక ప్రమాదంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ పలు బస్తీల్లో రక్షణలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు స్థానికుల పాలిట ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. బస్తీల్లో నిత్యం స్థానికులు రాకపోకలు సాగించే రోడ్ల పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాల్సిన విద్యుత్ శాఖ వీఐపీ ప్రాంతాల్లో మాత్రమే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు తీసుకుంటుందంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్‌జోన్ 10 సర్కిళ్ల పరిధిలో ప్రమాదకరంగా ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు గుర్తించి వాటి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. అయితే, కొంతమంది అధికారులు కాలనీలు, వీఐపీ జోన్లకు అధిక ప్రాధాన్యమిస్తూ ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజ్‌భవన్ ఎదురుగా ఎంఎస్ మక్తా, యూసుఫ్‌గూడ రహ్మత్‌నగర్, బోరబండ, ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ వంటి ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు లేకపోవడంతో డీటీఆర్‌ల నుంచి తీగలు రోడ్లకు తగులుతూ ప్రమాదకరంగా మారుతున్నాయి. పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్లే విద్యార్థులు, స్థానికులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదకరంగా మారిన తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖైరతాబాద్ రాజ్‌భవన్ ఎదురుగా ఎంఎస్ మక్తాలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేదని వాటి చుట్టూ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని ఎలాంటి ప్రమాదాలు జరగకు ముందే వాటి చుట్టూ విద్యుత్‌శాఖ రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ముట్టుకున్న మతిస్థిమితం లేని వ్యక్తి

- తీవ్ర గాయాలు.. గాంధీ ఆస్పత్రికి తరలింపు

**పంజాగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** మతిస్థిమితం సరిగ్గా లేని వ్యక్తి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజీ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంకు వద్ద చోటు చేసుకుంది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన గుర్తు తెలియని వ్యక్తి మానసికస్థితి సరిగ్గా లేదు. సోమవారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజీ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంకు వద్దకు వచ్చాడు. పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు వెంటనే పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. 50 శాతం కాలిన గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నీలిమ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన రాంగోపాల్‌పేట బీఆర్ఎస్ నాయకులు ముక్తార్ అహ్మద్, ఎండీ ఇబ్రహిం తదితరులు

## బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరిక

**బేగంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ప్రజా పాలనకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు ముక్తార్ అహ్మద్, ఎండీ ఇబ్రహీం, ఖురేషి, ఎండీ అజర్, అబ్దుల్ రహీం, అబ్దుల్ సమీ, ఎండీ సిద్దిక్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కోట నీలిమ వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మనోజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సురేష్ కుమార్

**ఎర్రగడ్డ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ఎటువంటి అల్లర్లకు తావివ్వకుండా శాంతియుతంగా గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ సూచించారు. సోమవారం ఎర్రగడ్డలోని నూర్ ఫంక్షన్ హాల్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ మండపాల నిర్వహణకు, ఊరేగింపులకు పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద రాత్రి వేళల్లో తప్పనిసరిగా కొందరు కాపలా ఉండాలన్నారు. రాత్రి 10గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎటువంటి మైక్ సౌండ్‌లను పెట్టొద్దని, డీజేలు వాడొద్దని తెలిపారు. మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ పరికరాలను, మూడు, నాలుగు బకెట్లలో ఇసుకను ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ తెలిపారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సనత్‌నగర్ సీఐ శ్రీనివాసులు, పోలీసు అధికారులు కృష్ణ, మోహనుద్దీన్, సత్యనారాయణ, వివిధ పార్టీల, గణేశ్ మండపాల నిర్వాహకులు డి.సంజీవ, దూడల రవి గౌడు, మహమ్మద్ మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, మొహమ్మద్ సర్దార్, గంట మల్లేష్, మొహమ్మద్ అజార్, మొహమ్మద్ అమీర్, అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ హంతకులను కఠినంగా శిక్షించాలి

**గచ్చిబౌలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యా ఘటనను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొండాపూర్ మార్తాండ్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో డాక్టర్ హంతకులను కఠినంగా శిక్షించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.




కొవ్వొత్తుల ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు

# గోల్డ్ ట్రేడింగ్ పేరుతో మస్కా

- రెండో ఆదాయమార్గం ఉండాలంటూ నమ్మించి నగరవాసి నుంచి రూ. 2.83 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ఆర్థిక అవసరాలు తీరాలంటే రెండో ఆదాయమార్గం ఉండాలని నమ్మించిన సైబర్ నేరగాళ్లు గోల్డ్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని చెప్పి మోసం చేశారు. సైబర్ నేరగాళ్లు సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి (59)కి సంబంధించిన వివరాలు సేకరించారు. బాధితుడి కుమారుడు అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న సంగతి, ఇతర లోన్‌ల గురించి తెలుసుకున్నారు. అంతేకాకుండా అతడి ఆర్థిక అవసరాలను గుర్తించిన సైబర్ నేరగాళ్లు రెండో ఆదాయమార్గం ఉండాలని సూచించారు. గోల్డ్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించారు. ట్రేడింగ్ చేసేందుకు వాట్సాప్ ద్వారా లింకు పంపించారు. లింక్ ఓపెన్ చేస్తే గోల్డ్ ట్రేడింగ్ డాట్ కామ్ అనే వెబ్‌సైట్ వచ్చింది. సైబర్ నేరగాళ్లు సూచించిన విధంగా బాధితుడు కొంత మొత్తం పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడికి వచ్చిన లాభాలను తీసుకునేందుకు విత్‌డ్రా ఆప్షన్ ఇచ్చారు. కొంత మొత్తంలో లాభాలు తీసుకున్న బాధితుడు గోల్డ్ ట్రేడింగ్‌లో రూ.2.83 లక్షలు పెట్టుబడి పెట్టాడు. లాభాలు వచ్చినట్లుగా వెబ్‌సైట్‌లో చూపడంతో విత్‌డ్రా చేసుకునే ప్రయత్నం చేశాడు. వెంటనే అతడి మెయిల్‌కు "ఇన్‌ఫోగోల్డ్ ట్రేడింగ్ డాట్‌కామ్" నుంచి మీ పెట్టుబడిని వెరిఫై చేయాలంటే 1,295 డాలర్లు కట్టాలని మెయిల్ వచ్చింది. రెండోసారి డబ్బులు విత్‌డ్రా చేసే ప్రయత్నం చేసినప్పుడు, డబ్బులు ఖాతాలో జమకాకపోగా 2178 డాలర్లు చెల్లించాలని మెయిల్ వచ్చింది. దాంతో బాధితుడు వెబ్‌సైట్ నిర్వాహకులను సంప్రదించే ప్రయత్నం చేశాడు. వారు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## శిశువిహార్‌లోని బాలిక మృతి

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):** శిశువిహార్‌లో ఆశ్రయం పొందుతున్న బాలిక మృతిచెందిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వవరాల ప్రకారం.. 2018లో జన్మించిన ఒక పాపను ఆమె తల్లిదండ్రులు ఆలనా పాలనా చూసుకోలేక మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాంగణంలో ఉన్న శిశువిహార్‌లో అప్పగించారు. అప్పటికే పాపకు మానసిక, శారీరక పరిస్థితి సరిగ్గా లేనందున ప్రతి రోజూ వైద్యం చేయిస్తూ మందులు వాడుతున్నారు. ఈనెల 24న పాప(దేవసేన) పూర్తిగా నీరసించి పోయింది. దీంతో శిశువిహార్ సీడీపీఓ సంతోషిబాయి వెంటనే నీలోఫర్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో 25వతేదీ రాత్రి పాప మృతి చెందింది. శిశువిహార్ సీడీపీఓ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి

**పంజాగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** అనుమానాస్పద స్థితిలో ఆటోలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన వెంకటేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలానే ఆదివారం ఆటో తీసుకుని ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున పంజాగుట్టలోని ఓ మెడికల్ షాప్ ఎదురుగా ఆటోలో కదలకుండా పడిఉండడంతో స్థానికులు 108, పంజాగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే వెంకటేష్ మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్దనున్న ఆధారాలతో కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దోపిడీ దొంగల ఆటకట్టించిన బోరబండ పోలీసులు

- ఐదుగురు అల్లరిమూకల అరెస్ట్

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):** అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, దారి దోపిడీలకు, బెదిరింపులకు పాల్పడుతున్న అల్లరిమూకల ఆటకట్టించారు బోరబండ పోలీసులు. ఐదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్‌కు చెందిన కేవాటి కార్తికేయ(21), ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన జానపరెడ్డి సురేందర్(18), వరిద్యా రాకేష్ నాయక్(18), బానోతు గణేష్‌నాయక్(20), నానావత్ లోకేష్ నాయక్(20) ముఠాగా ఏర్పడి అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆదివారం రాత్రి ఐస్‌క్రీమ్ అమ్ముతున్న వ్యక్తి వద్ద ఐస్‌క్రీమ్‌లు తీసుకున్న గ్యాంగ్.. డబ్బులు అడిగినందుకు కుర్రాడిపై దాడికి పాల్పడ్డారు. అతని జేబులో ఉన్న డబ్బును లాక్కోవడానికి ప్రయత్నించారు. దాంతో బాధితుడు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్‌తో సహా.. రంగంలోకి దిగిన పోలీసులు అల్లరిమూకల ఆటకట్టించారు.

## ఇనుప చువ్వల దొంగ అరెస్ట్

**బర్కత్‌పుర ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ఇనుప చువ్వలను దొంగిలించిన దొంగను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ డివిజన్ పెట్రోల్ బంక్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు వరద నీటి కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కాంట్రాక్టర్ నిర్మాణం కోసం ఇనుప చువ్వలను తీసుకువచ్చాడు. ఏ సాయిబాబా (44) 20 కేజీల ఇనుప చువ్వలను సోమవారం సాయంత్రం ఎత్తుకెళ్లాడు. దీనిపై నిర్మాణ పనుల ఇంజనీర్ సతీష్ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ద్వారా సాయిబాబాను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు అతని వద్ద నుంచి దాదాపు రూ. 30 వేల రూపాయల విలువగల 20 కేజీల ఇనుప చువ్వలను స్వాధీనం చేసుకున్నట్లు అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**బర్కత్‌పుర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ మక్సూద్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ 45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై తెలుపు నీలి రంగు గీతల షర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు ఉంది. మృతుడిని గుర్తుపట్టిన వారు 9912221985 ఫోన్‌కు వివరాలు తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి అదృశ్యం



జంగిటి నవీన్

**మల్కాజిగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి ఒకరు అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన జంగిటి నవీన్ (29) ఫ్లిప్‌కార్ట్‌లో ఉద్యోగి. కాగా ఈనెల 21న తన ద్విచక్రవాహనంపై విధులకు వెలుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి ఈ రోజు వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తుందని అతడి తండ్రి డేవిడ్ సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



వ్యక్తి మృతదేహం

**దుండిగల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గండిమైసమ్మ నుంచి మేడ్చల్‌కు వెళ్లే దారిలో పెద్ద మసీదు వద్ద ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నేతాజీనగర్ సవరాలబస్తీలో గణేశ్ ఆగమన్ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, పొగర్తి భువనరావు

## సవరాలబస్తీలో గణేశ్ ఆగమన్

**బౌద్ధనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** సీతాఫల్‌మండి డివిజన్ నేతాజీనగర్ సవరాలబస్తీలో సోమవారం గణేశ్ ఆగమన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు మూడులక్షల యాభైవేల రూపాయల విలువ చేసే వేంకటేశ్వరస్వామి అవతారంలో ఉన్న వినాయకుడి విగ్రహాన్ని పార్శిగుట్ట చౌరస్తా నుంచి సవరాల బస్తీ మండపం వరకు భారీ ర్యాలీగా తీసుకువచ్చారు. యువకులు, మహిళలు అధికసంఖ్యలో వినాయకుడికి స్వాగతం పలికారు. మూడులక్షల రూపాయలతో ట్రస్‌లైట్లు ఏర్పాటుచేశారు. భజరంగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకుడు పొగర్తి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, పొగర్తి భువనరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువనాయకులు పోగర్తి మహేశ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా లక్ష బిల్వార్చన

**సికింద్రాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** శ్రావణ మాసం ఆఖరి సోమవారంను పురస్కరించుకుని బోయినపల్లి సీతారాంపురం కాలనీలోని శివపంచాయతన హనుమాన్ దేవాలయంలో లక్ష బిల్వార్చన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు హాజరై పూజలు జరిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, 6వ వార్డు మాజీ సభ్యుడు కె.పాండుయాదవ్‌లు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 22 సంవత్సరాల నుంచి ఆలయంలో లక్ష బిల్వార్చన జరపడం శుభపరిణామమని అన్నారు. లక్ష బిల్వార్చన పూజల్లో పాల్గొనడం ద్వారా భక్తులకు అంతా మంచి చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, కృష్ణ, సాయిబాబ, సత్యనారాయణలు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



మరాఠబస్తీలో నిర్వహించిన సమావేశంలో ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి సభ్యులు

## ఉప కులాలకు అన్యాయం చేస్తే .. మరో పోరాటానికి సిద్ధం : సనాదన్

- కులగణన చేసిన తరువాతనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

**అడ్డగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** కులగణన చేసిన తరువాతనే శాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఉప కులాలకు అన్యాయం చేయాలని చూస్తే పోరాటానికి సిద్ధమని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపదే సనాదన్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లోని మరాఠబస్తీలో ఉప కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఎస్సీ ఉప కులాల సుదీర్ఘ పోరాటం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తానని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాటసమితి తరుపున అభినందనలు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అన్ని రంగాలలో దళితుల్లో అన్యాయానికి గురైన కులాల పక్కా సమాచారం తీసుకున్న తరువాతనే వర్గీకరణ చేయాలని సూచించారు. దళితుల్లో కులగణన చేపట్టిన తరువాత జనాభా దామాషా ప్రకారం శాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని, వెంటనే విశ్రాంతి న్యాయమూర్తితో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు సకట్ మిస్రాకర్, సంజు కమలే, విజయ్, గోపి, గణేష్ కుందన్, ఉపాధి మహేష్, ఉపాధి రతిలాల్, అక్షయ్, జిట్లల్, బిజు, మోతిలాల్, సకట్ సకారంలు పాల్గొన్నారు.



వినోభానగర్‌లోని శ్మశానవాటికను సందర్శిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి తదితరులు

## వినోభానగర్ శ్మశానవాటిక ఆధునీకరణకు కృషి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

**తార్నాక, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) :** లాలాపేట్‌లోని వినోభానగర్ శ్మశానవాటిక ఆధునీకరణకు కృషి చేస్తానని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి లాలాపేట్‌లోని వినోభానగర్‌లోని శ్మశానవాటికను సందర్శించిన డిప్యూటీ మేయర్ శ్మశానవాటికలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. స్థానికులు ప్రధానంగా శ్మశానవాటికలో స్నానాల సదుపాయం, బోర్ కనెక్షన్, మరుగుదొడ్లు, వీధి దీపాల సౌకర్యం మెరుగుపరచాలని డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వినోభానగర్‌లోని శ్మశానవాటికను వైకుంఠదామంలా సుందరీకరణ చేసేవిధంగా ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వినోభానగర్ కాలనీవాసులు ప్రవీణ్‌లాల్, మహేష్, ప్రవీణ్ కుమార్, నర్సింగ్‌రావు, జయ, వినోద్‌కుమార్, కిరణ్‌కుమార్, హనుమంతు, ఆంజనేయులు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న చెంత నిద్ర చేస్తానని.. వెళ్లి అనంతలోకాలకు

**వేములవాడ కల్చరల్, ఆగస్టు 26:** రాజన్నకు మొక్కుకున్నానని... నిద్ర చేసి వస్తానని... కుటుంబ సభ్యులతో చెప్పి వారిని పంపించి మరుసటి రోజున ఓ వృద్ధురాలు అనంతలోకాలకు వెళ్లిన సంఘటన ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఎన్‌బీటీనగర్ పాటిగడ్డకు చెందిన వంగ లచ్చవ్వ (79) అనే వృద్ధురాలు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాజన్న దర్శనానికి వచ్చింది. రాజన్నను దర్శనం చేసుకున్న అనంతరం తాను రాజన్న ఆలయంలో రెండు రోజులు నిద్రచేస్తానని మొక్కుకున్నానని, మీరు వెళ్లండి అని కుటుంబ సభ్యులకు చెప్పి వారిని పంపించింది. శనివారం రాత్రి రాజన్న ఆలయంలో నిద్రించింది. ఆదివారం ఆలయ ఆవరణలో ఉంది. ఆదివారం రాత్రి కూడా ఆలయ ఆవరణలో నిద్రించింది. సోమవారం తెల్లవారుజామున రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో మృతి చెంది భక్తులకు కనిపించింది. లచ్చవ్వ ఆదివారం రాత్రి కొంత అనారోగ్యానికి గురై బాధపడుతూ నిద్రించినట్లు భక్తులు తెలిపారు. లచ్చవ్వ వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఆలయ అధికారులు తెలిపారు.



సికింద్రాబాద్ ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణుడు





ఇస్కాన్ టెంపుల్ వద్ద భక్తుల రద్దీ

# లష్కర్‌లో ఘనంగా కృష్ణాష్టమి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- చిన్నికృష్ణుని వేషధారణలో అలరించిన చిన్నారులు



మనువడు తలసాని తారక్‌బాబుకు శ్రీకృష్ణుడి బొమ్మను బహుమతిగా ఇస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణాష్టమి వేడుకలు లష్కర్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాలలోని కాలనీలు, బస్తీలు, ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నారులకు బాలకృష్ణుని వేషధారణ చేసి తల్లిదండ్రులు మురిసిపోయారు. బోయినపల్లిలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యుడు కె.పాండుయాదవ్‌లు అతిథులుగా హాజరయ్యారు. వారిని యాదవ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వెంకటేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, అరుణ్‌యాదవ్, ముఖేష్‌యాదవ్, విఠల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారి



రాధ,కృష్ణ వేషధారణలతో మారుతీ వీధిలోని సంజన ప్లే స్కూల్ చిన్నారులు



సికిందరాబాద్ హరిహర కళాభవన్‌లో సోమవారం రాష్ట్ర యాదవ సంఘం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన

## గోల్డ్ ట్రేడింగ్ పేరుతో మస్కా

- రెండో ఆదాయ మార్గం ఉండాలంటూ నమ్మించి
- నగరవాసి నుంచి రూ.2.83 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ఆర్థిక అవసరాలు తీరాలంటే రెండో ఆదాయ మార్గం ఉండాలని నమ్మించిన సైబర్ నేరగాళ్లు గోల్డ్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని చెప్పి మోసం చేశారు. సైబర్ నేరగాళ్లు సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి (59)కి సంబంధించిన వివరాలు సేకరించారు. బాధితుడి కుమారుడు అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న సంగతి, ఇతర లోన్‌ల గురించి తెలుసుకున్నారు. అంతేకాకుండా అతడి ఆర్థిక అవసరాలను గుర్తించిన సైబర్ నేరగాళ్లు రెండో ఆదాయ మార్గం ఉండాలని సూచించారు. గోల్డ్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించారు. ట్రేడింగ్ చేసేందుకు వాట్సప్ ద్వారా లింకు పంపించారు. లింక్ ఓపెన్ చేస్తే గోల్డ్ ట్రేడింగ్ డాట్ కామ్ అనే వెబ్‌సైట్ వచ్చింది. సైబర్ నేరగాళ్లు సూచించిన విధంగా బాధితుడు కొంత మొత్తం పెట్టుబడి పెట్టాడు. పెట్టిన పెట్టుబడికి వచ్చిన లాభాలను తీసుకునేందుకు విత్‌డ్రా ఆప్షన్ ఇచ్చారు. కొంత మొత్తంలో లాభాలు తీసుకున్న బాధితుడు గోల్డ్ ట్రేడింగ్‌లో రూ. 2.83లక్షలు పెట్టుబడి పెట్టాడు. లాభాలు వచ్చినట్లుగా వెబ్‌సైట్‌లో చూపడంతో విత్‌డ్రా చేసుకునే ప్రయత్నం చేశాడు. వెంటనే అతడి మెయిల్‌కు "ఇన్ఫో'గోల్డ్ ట్రేడింగ్ డాట్‌కామ్" నుంచి మీ పెట్టుబడిని వెరిఫై చేయాలంటే 1295 డాలర్లు కట్టాలని మెయిల్ వచ్చింది. రెండోసారి డబ్బులు విత్‌డ్రా చేసే ప్రయత్నం చేసినప్పుడు, డబ్బులు ఖాతాలో జమకాకపోగా 2178 డాలర్లు చెల్లించాలని మెయిల్ వచ్చింది. దాంతో బాధితుడు వెబ్‌సైట్ నిర్వాహకులను సంప్రదించే ప్రయత్నం చేశాడు. వారు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



దేవతామూర్తుల పాత చిత్రాలను యాగ సమర్పణ చేస్తున్న శ్రీమాతా సేవా సమితి సభ్యులు

## దేవతా చిత్రాల యాగసమర్పణ

**సనత్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** చెత్తలో పారేసిన వేవుళ్ల పాత చిత్రపటాలను, పాత క్యాలెండర్‌లలో ఉన్న దేవతా చిత్రపటాలను సేకరించిన శ్రీమాతా సేవా సమితి సభ్యులు వాటిని శాస్త్రోక్తంగా అగ్నికి ఆహుతి చేశారు. సనత్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్తలో పడేసిన దేవతా చిత్రపటాలు, క్యాలెండర్లు, విగ్రహాలు, పూజా సామగ్రిని సేకరించిన మాతాసేవా సమితి సభ్యులు సోమవారం హనుమాన్ దేవస్థానంలోని రామ్‌లీలా మైదానంలో యాగసమర్పణ చేశారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు అనుమతితో అర్చకులు కృష్ణశాస్త్రి దేవతా చిత్రాల ఉద్వాసన, విసర్జన కోసం శాస్త్రోక్తంగా పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. ప్రతి ఆలయం వద్ద ఇదే తరహాలో కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఎవరి వద్దనైనా పాత చిత్రపటాలు, విగ్రహాలు ఉంటే తమకు అప్పగించాలని మాతాసేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు కుసుమ విజయ కోరారు.



నీలిమ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన రాంగోపాల్‌పేట బీఆర్ఎస్ నాయకులు ముక్తార్ అహ్మద్, ఎండీ ఇబ్రహీం తదితరులు

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

**బేగంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ప్రజా పాలనకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు ముక్తార్ అహ్మద్, ఎండీ ఇబ్రహీం, ఖురేషి, ఎండీ అజర్, అబ్దుల్ రహీం, అబ్దుల్ సమీ, ఎండీ సిద్దిక్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కోట నీలిమ వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మనోజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నగర మాజీ మేయర్

# కొర్వి కృష్ణస్వామి జయంతి



కృష్ణస్వామి జయంతి వేడుకలను ప్రారంభించిన ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్



కొర్వి కృష్ణస్వామి విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్



కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ తదితరులు

**పద్మారావునగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్ నగర తొలి మేయర్, సంఘ సంస్కర్త, పత్రికా సంపాదకులు కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతి వేడుకలను సికిందరాబాద్ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ మహోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ...తెలంగాణలో అతిపెద్ద సామాజికవర్గమైన ముదిరాజ్‌ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. త్వరలో ముదిరాజ్ పెద్దలతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తానని అన్నారు. ముదిరాజ్ మహాసభ యువ నాయకులు కాసాని వీరేశ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ కు మార్చాలని, జీఓ నెంబర్ 15ను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఈ వేడుకలలో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎం.మురళి, రిటైర్డ్ ఐఏఎస్ జగన్ మోహన్, ప్రభుత్వ న్యాయవాది పాండు, మహాసభ నాయకులు దివాకర్, డి.సదానంద్, చెన్నయ్య, వెంకటేశం, అంజయ్య, జగదీశ్వర్, శ్రీకాంత్, సురేందర్, మన్మోహన్, నీలం శ్రీనివాస్, ఎం.శారద, రాజేంద్ర ప్రసాద్, జిల్లాల నాయకులు, ముదిరాజ్ ప్రముఖులకు సన్మానం, పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ తదితర సేవా కర్యక్రమాలనునిర్వహించారు.

**మారేడుపల్లి :** ఎదగని కులాలను అన్ని రంగాల్లో ఎదగనిచ్చి భివతరాలకు బంగారు బాట వేస్తామని మల్కాజ్‌గిరి పార్లమెంట్ మెంబర్ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం కొర్వి కృష్ణస్వామి సమితి రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నాగేష్ ముదిరాజ్ అధ్వర్యంలో నగర తొలి మేయర్ కొర్వి కృష్ణ స్వామి 131వ జయంతి వేడుకలను పికెట్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. పార్లమెంట్ మెంబర్ ఈటల రాజేందర్, శాసన సభ మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, కార్పొరేటర్ సామల హేమ, ప్రొఫెసర్లు, మాజీ ఐఏఎస్ అధికారులు, కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్‌మోహన్, శంకర్, వీరమని, అశోక్, భాస్కర్, శ్రీనివాస్, సత్యం, రాములు, భూపతి, నందికంటి రవి, ముప్పిడి మధుకర్, బద్రీనాథ్ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, నాగేష్ యాదవ్, బాబురావు, సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### చిలకలగూడలో ..

**బౌద్ధనగర్ :** హైదరాబాద్ నగర మాజీ మేయర్ కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకలు సోమవారం చిలకలగూడ గాంధీబొమ్మ వద్ద నిర్వహించారు. సికింద్రాబాద్ ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా పాల్గొని కొర్వి కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిముదిరాజ్, పి.సంజీవ్‌ముదిరాజ్, సతీష్,గణేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, నగేష్, రాంబాబు, కనకయ్య పాల్గొన్నారు.



మదర్ థెరిసా జయంతి వేడుకలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కాంగ్రెస్ నాయకులు

## మదర్ థెరిసా సేవలు ఆదర్శనీయం

**రెజిమెంటల్‌బజార్,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** మదర్ థెరిసా జయంతి సందర్భంగా సికింద్రాబాద్‌లో ఉన్న మదర్ థెరిసా విగ్రహం వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, టీడీపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ జనరల్ సెక్రటరీ గౌరిశంకర్ యాదవ్, హైకోర్టు అడ్వకేట్ రెవరెండ్ గ్లోరి ఆనంద్, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షులు నందికంటి రవి నివాళులు అర్పించారు. కేకులు కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. మదర్ థెరిసా సేవలు ఆదర్శనీయమని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు.

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్య

**మల్కాజిగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి మారుతీనగర్‌కు చెందిన తరుణ్ అలియాస్ దిలీప్ (20) డిగ్రీ రెండో సంవత్సరం (ఓపెన్ డిగ్రీ) చేస్తున్నాడు. తండ్రి రాజేందర్ లారీ డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, ఈ నెల 25న రాజేందర్ తన విధులకు వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తన కుమారుడు తరుణ్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. తిరిగి సాయంత్రం విధుల నుంచి ఇంటికి వచ్చేసరికి ఇంటి గడియ వేసి ఉంది. ఎంత పిలిచినా తలుపులు తెరవకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు లుంగీతో తరుణ్ ఉరివేసుకుని ఉన్నాడు. ఇరుగు పొరుగు వారి సహాయంతో కుమారుడిని దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ..



పవన్ కుమార్ (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్‌కుమార్ (34) మల్కాజిగిరిలోని 7 బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 23న ఉదయం కనిపించకపోవడంతో సహచర మిత్రులు కానిస్టేబుల్స్ 7 బెటాలియన్‌లో వెతుకుతుండగా అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పక్కన పవన్ మృతదేహం కనిపించింది. ఆ సమయంలో పవన్ గొంతుచుట్టూ కేబుల్ వైరు బిగించుకుని ఉంది. పవన్ ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించిన సహచర ఉద్యోగులు తమ అధికారికి సమాచారం అందించారు. 7 బెటాలియన్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి అదృశ్యం



మోహన్ కృష్ణ (ఫైల్)

**మూడుచింతలపల్లి, ఆగస్టు 26 :** యువకుడు అదృశ్యమైన సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... తూంకుంటకు చెందిన ధూళ్ళ మోహన్‌కృష్ణ (20) తన బాబాయి అయిన ధూళ్ళ శ్రీనివాసరావు వద్ద ఉంటూ మోర్ సూపర్ మార్కెట్‌లో పని చేస్తున్నాడు. కాగా, ఈనెల 21న మధ్యాహ్నం ఒంటి గంటకు పని నిమిత్తం కొంపల్లిలోని విజేత సూపర్ మార్కెట్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో వెతికి చూసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఫ్లిప్‌కార్డు ఎంప్లాయి..



జంగిటి నవీన్ (ఫైల్)

**మల్కాజిగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** ఫ్లిప్‌కార్డు ఉద్యోగి ఒకరు అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ఇందిరా నెహ్రూనగర్‌కు చెందిన జంగిటి నవీన్ (29) ఫ్లిప్‌కార్డులో ఉద్యోగి. కాగా ఈనెల 21న తన ద్విచక్రవాహనంపై విధులకు వెలుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి ఈ రోజు వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తుందని అతడి తండ్రి డేవిడ్ సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**బర్కత్‌పుర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):** పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ మక్సూద్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ 45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై తెలుపు, నీలి రంగు గీతల షర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు ఉంది. మృతుడిని గుర్తుపట్టిన వారు 9912221985 ఫోన్‌కు వివరాలు తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.